క్లుప్తంగా

తప్పులను సరిచేయాలి



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ప్రభుత్వం ఎస్సీ ఉప వర్గీకరణకు సంబంధించి చేపడుతున్న కుల గణాంక వివరాలు శాస్త్రీయంగా లేవని.. అందులో చోటుచేసుకున్న తప్పులను సరిచేయాలని ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ రైట్స్ ఫోరం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ అంబేడ్కర్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్సీల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. కలెక్టర్‌ని కలిసిన వారిలో ఫోరం ప్రతినిధులు భానుమూర్తి, దారాన వెంకటేష్, వేముల వంశీ, తదితరులు ఉన్నారు.

సూచనలు, సలహాలు ఇవ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు

విజయనగరం ఫోర్ట్: తుఫాన్ వర్షాలకు తడిచిన మొక్కజొన్న, అపరాల పంటలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు సూచనలు, సలహాలు అందించాలని జిల్లా వ్యవసాయాధికారి వి. తారకరామారావు అన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధిక దిగుబడిని ఇచ్చే నూతన వంగడాలపై పరిశోధనల చేసి రైతులకు అందించాలన్నారు. శాస్త్రవేత్తలు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంటలకు ఆశించు తెగుళ్లు, చీడపీడల నివారణ చర్యలపై వివరించాలని సూచించారు. సమావేశంలో పరిశోధన స్థానం అధిపతి టీఎస్ఎస్‌కే పాత్రో, శాస్త్రవేత్తలు ఎస్. అనురాధ, కె. తేజశ్వేరరావు, యు. త్రివేణి, ఎం.స్వాతి, కె.లక్ష్మణ, ఎంఎంపీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



ఎల్ఎన్ పురంలో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ సుదర్శనరావు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: భూ సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సుదర్శనరావు అన్నారు. మండలంలోని ఎల్ఎన్ పురం, కొండగుంపాం గ్రామాల్లో శనివారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూ సంబంధిత సమస్యలను ఎటువంటి రుసుం లేకుండా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కర్రోతు వెంకటరమణ, వాల్లె అప్పలనాయుడు, ఆర్ఎస్‌డీటీ సత్యనారాయణ, ఆర్ఐ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభం



బ్రాంచ్ ప్రారంభోత్సవంలో బ్యాంక్ అధికారులు, సిబ్బంది

డెంకాడ: మండలంలోని చింతలవలస గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 70వ శాఖను ఆ బ్యాంక్ జనరల్ మేనేజర్ శాలినీ మీనన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందించడం జరుగుతుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ మేనేజర్ నరేష్, బ్రాంచ్ మేనేజర్ హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్ షా క్షమాపణలు చెప్పాలి



అంబేడ్కర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

నెల్లిమర్ల రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా తక్షణమే క్షమాపణలు చెప్పాలని డీబీఎస్‌యూ నాయకుడు రాయి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని సారిపల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి శనివారం వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, మంత్రి పదవికి రాజీనామా చేయాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు రామేశ్వరరావు, వాసు, చంద్రశేఖర్, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

• వీరు మారరంతే...!

రైల్వే పట్టాలు దాటుతుండగా ప్రమాదాలు జరిగి ఎంతోమంది మృత్యువాత పడుతున్నారు. అధికారులు సైతం నిత్యం హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయినప్పటికీ ప్రజల్లో మార్పు రాకపోవడం బాధాకరం. పట్టణంలో పలుచోట్ల రైల్వే ట్రాక్‌ల పైనుంచి ఫుట్ ఓవర్ బ్రిడ్జిలున్నా వినియోగించకుండా... ప్రమాదకరంగా పట్టాలను దాటుకుంటూ వెళ్తూ.. ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి, పట్టాల మీదుగా రాకపోకలు మానుకోవాలని పలువురు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం





అనధికార భవనంపై చర్యలు ఎందుకు తీసుకోలేదు..?



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సరోజిని

• నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ధ్వజం

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని మొయిద జంక్షన్‌లో నిర్మించిన అనధికార భవన సముదాయంపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించారు. శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ బంగారు సరోజిని అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మైపాడ ప్రసాద్, అవనాపు సత్యనారాయణ, మొయిద శ్రీనివాసరావు అనధికార భవనంపై అధికారులను ప్రశ్నించారు. సాయిసుభద్ర థియేటర్ ప్రాంగణంలో ఎటువంటి అనుమతుల్లేకుండా మల్టీప్లెక్స్‌తో పాటు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాల్లో ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులెవరని కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఇప్పటికైనా స్పందించి సదరు భవన యజమానిపై కేసు పెట్టాలని కోరారు. అలాగే పట్టణంలో వీధిదీపాల నిర్వహణ అధ్వాన్నంగా ఉందని పలువురు సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. చాలా వీధుల్లో లైట్లు వెలగడం లేదని చెప్పారు. అలాగే పలుచోట్ల విద్యుత్ స్తంభాలు షాక్ కొడుతున్నాయని ప్రస్తావించారు. సమావేశంలో కమిషనర్ కె. అప్పలరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి. ఉమాభాస్కర్, ఇన్‌చార్జ్ మేనేజర్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి



సైకిళ్లు అందుకున్న విద్యార్థినులతో ఎస్‌బీఐ, పాఠశాల సిబ్బంది

• ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ సురేష్‌బాబు

పూసపాటిరేగ: విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగినప్పుడు విజయాలు సొంతమవుతాయని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఎం.సురేష్‌బాబు అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధులతో పది మంది విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని చెప్పారు. అఖిల భారత సర్వీసులకు సైతం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎంపికవుతున్నారని తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం బి. శంకరరావు మాట్లాడుతూ.. ఎస్‌బీఐ బ్రాంచ్ ఇచ్చిన వితరణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ హెచ్‌ఆర్ మేనేజర్ నరేష్‌కృష్ణ, డిప్యూటీ మేనేజర్ జమ్ము శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు శేషసాయి, తదితరులు పాల్గొన్నారు.

రంగు మారిన ధాన్యం కొనుగోలు చేస్తాం..

• ఎమ్మెల్యే లోకం నాగమాధవి



గుణుపూరు ప్రాంతంలో వరి పనలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

డెంకాడ: తుఫాన్ ప్రభావంతో రంగుమారిన, పాడైన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని గుణుపూరు ప్రాంతంలో వర్షాలకు తడిచిన వరి కుప్పలను, పనలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రంగు మారిన ధాన్యాన్ని సైతం మద్దతు ధరకే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. రైతులను ఇబ్బంది పెట్టే మిల్లర్లపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కంది సూర్యనారాయణ, మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

విజయనగరం ఫోర్ట్: బాల్య వివాహాలు అరికట్టడంలో అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. శనివారం స్థానిక వీటీ అగ్రహారం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో జూమ్ మీటింగ్ (సఖి) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు చోటుచేసుకుంటాయని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఏడాది నుంచి సంపూర్ణ పాలిథిన్ నిషేధం

• కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య



వ్యాపారులతో సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: రానున్న జనవరి ఒకటో తేదీ నుంచి నగరంలో పాలిథిన్ ఉత్పత్తుల నిషేధాన్ని సంపూర్ణంగా అమలు చేయనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. శనివారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో రిటైల్, హోల్‌సేల్ పాలిథిన్/ ప్లాస్టిక్ విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధానికి విక్రయదారులు పరిపూర్ణ సహకారం అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విక్రయదారులకు ఉన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మానవాళి మనుగడకు ప్రశ్నార్థకంగా మారుతున్న ప్లాస్టిక్ భూతాన్ని నగరం నుంచి తరిమికొట్టేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న ఉత్పత్తులను కచ్చితంగా నిషేధిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను కూడా విక్రయించరాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎన్నో ప్రత్యామ్నాయ వస్తువులు అందుబాటులోకి వచ్చాయని, వాటిని విక్రయించినట్లయితే పర్యావరణానికి ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు. ఇక నుంచి ప్రతిరోజూ సర్కిళ్ల వారీగా దాడులు నిర్వహిస్తామన్నారు. పాలిథిన్ విక్రయాల నిషేధానికి వ్యాపారులు సైతం అంగీకారం తెలిపారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, రవిశేఖర్, హోల్‌సేల్, రిటైల్ ప్లాస్టిక్ విక్రయదారులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా రిసోర్సుపర్సన్ల శిక్షణ



శిక్షణ తరగతుల షెడ్యూల్‌ను విడుదల చేసిన డిప్యూటీ ఈఓ కేవీ రమణ తదితరులు

విజయనగరం అర్బన్: విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో స్కూల్ మేనేజ్‌మెంట్ సభ్యులకు అవగాహన కలిగించే అంశాలపై తొలిత జిల్లా రీసోర్సుపర్సన్‌లకు స్థానిక కస్పా మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో శనివారం ఒక రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. మండల, పాఠశాల స్థాయిల్లో అవగాహన కలిగించాల్సిన ప్రణాళిక, పాఠశాల అభివృద్ధి, ఎస్ఎంసీ సమావేశ నిర్వహణ, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఒకరోజు శిక్షణగా నిర్వహించిన ఈ తరగతులకు రీసోర్సుపర్సన్లుగా అరసాడ ప్రవీణ్ కుమార్, ఎం.ఎస్.ప్రసాద్, కోర్సు కో ఆర్డినేటర్లుగా సీఎంఓ వి.ఆదినారాయణ, అసిస్టెంట్ సీఎంఓ రామారావు వ్యవహరించారు. 27 మండలాల నుంచి 150 మంది రీసోర్సుపర్సన్లకు శిక్షణ అందజేసారు. అనంతరం మండల, పాఠశాల స్థాయి శిక్షణా తరగతుల షెడ్యూల్‌ను విడుదల చేసారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ కేవీ రమణ, ఎంఈఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

30న జిల్లా వ్యాప్తంగా నిరసనలు

• వామపక్ష నేతలు



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న వామపక్ష నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న జిల్లాలోని అన్ని మండల, ప్రధాన కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు తెలిపారు. శనివారం స్థానిక ఎల్‌బీజీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ పేరు కంటే దేవుడిని తలుచుకుంటే పుణ్యం వస్తుందని అమిత్ షా అనడం సరికాదన్నారు. రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడడం దారుణమన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. అంబేడ్కర్‌ను అవమానించడం అంటే దేశ ప్రజలను, రాజ్యాంగాన్ని అవమానించడమేనన్నారు. నిరసన కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నిరసన కార్యక్రమాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందుకుంటున్న విజయనగరం ఆర్టీసీ జోనల్ చైర్మన్ దొన్ను దొర

విజయనగరం అర్బన్: ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీఎస్ ఆర్టీసీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ సెక్రటరీ ఎ.అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని ఆర్టీసీ జోనల్ చైర్మన్ దొన్ను దొరను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. ఆర్టీసీలో థర్డ్ పార్టీ విధానంలో 7,300 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరందరికీ జీతాలను సంస్థ నుంచి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చైర్మన్‌ను కలిసిన వారిలో తిరుపతి, నరసమ్మ, ఈశ్వరరావు, సురేష్, తదితరులున్నారు.

• బాధ్యతగా పనిచేయాలి..



వైద్యాధికారులు బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. ప్రజల ఆరోగ్య పరిస్థితులను అర్థం చేసుకోకుండా లేనిపోని వదంతులను సృష్టించడం, ఏదైనా సంఘటన జరిగినా పక్కవారి మీద తోసేయడం వంటివి చేస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో వైద్యాధికారులతో శనివారం సమీక్షించారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చూసే బాధ్యత కూడా వైద్యాధికారులదేనని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్య అధికారి రాణి, డీసీహెచ్ఎస్ రాజ్యలక్ష్మి, జీజీహెచ్, మెడికల్ కళాశాల సూపరింటెండెంట్లు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.

– విజయనగరం అర్బన్

• ఆకట్టుకున్న లెర్నింగ్ ఫెస్ట్



ఫోర్ట్ సిటీ స్కూల్‌లో లెర్నింగ్ ఫెస్ట్ పేరుతో శనివారం విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. గణితం, సైన్స్ సంబంధిత సాంకేతిక సృజనాత్మక ప్రాజెక్ట్‌లతో పాటు తెలుగు, హిందీ, ఇంగ్లిష్, సోషల్, కంప్యూటర్, వ్యాయామ విద్య, ఆర్ట్స్, డ్యాన్స్, సంప్రదాయ సంగీత, ఆధ్యాత్మిక అంశాలపై విద్యార్థులు ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కేపీరాజు (శివ), వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపాల్ డాక్టర్ రోయినాఖాన్, డైరెక్టర్లు మధు, అవోక్ నీలిమా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

– విజయనగరం అర్బన్

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

• పట్టణంలో పలు చోట్ల ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరణ

విజయనగరం ఫూల్‌బాగ్: విద్యార్థి ఉద్యమాల వేగుచుక్క ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు సూరిబాబు పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ.. 1970లో తిరువనంతపురంలో ఏర్పడిన భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 54 సంవత్సరాలు పూర్తి చేసుకుని నేటితో 55వ వసంతంలోకి అడుగుపెడుతోందని తెలిపారు. ఈ 55 ఏళ్ల ప్రస్థానంలో అనేక త్యాగాలు, అనేక పోరాటాలతో దేశ పోరాట చరిత్రలో ప్రత్యేక స్థానం దక్కించుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల్లో విడుదల చేస్తామన్న ఉపకార వేతనాలు ఇప్పటికీ విడుదల చేయలేదని.. తక్షణమే విడుదల చేయడంతో పాటు సంక్షేమ హాస్టల్లో మెస్ చార్జీలు పెంచాలని కోరారు. అలాగే విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం తక్షణమే నిర్మించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఫోర్ఎస్ జూనియర్ కళాశాల, పలు పాఠశాలలు, వివిధ సంక్షేమ వసతి గృహాల్లో జెండాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు పి. రమేష్, కె. రాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు వాసు, రాహుల్, మురళి, కుమారస్వామి, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కారం



సమస్యలపై అర్జీలు అందజేస్తున్న రైతులు

• తహసీల్దార్ తాడ్డి గోవింద

పూసపాటిరేగ: ఎంతో కాలంగా ఉన్న భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించుకోవాలని తహసీల్దార తాడ్డి గోవింద అనానరు. మండలంలోని పేరాపురంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మ్యుటేషన్లు, డీ పట్టా మంజూరు, వివిధ భూ సమస్యలపై ఫిర్యాదులు చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ, రెవెన్యూ సదస్సుల్లో అందించే సేవలకు ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ గణపతిరావు, సర్పంచ్ రౌతు శ్రీరామ్మూర్తి, ఎంపీటీసీ సభ్యుడు పతివాడ తమ్మునాయుడు, ప్రజాప్రతినిధులు బొంతు రవికుమార్, కొలచిన రమేష్ ,రౌతు స్వామినాయుడు, జలపార శివ, బూర సతీష్, కొలచిన శరత్‌బాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.